



## పేరంటం

సూరి అరుగు చివర కూర్చుని కాళ్లు వేళ్లాడవేసుకొని ఊపుతూ, ఎదురుగుండా గడ్డి మేస్తున్న మేకపిల్లల కేసి చూస్తూ పాడుకుంటోంది.

"అమ్మా నాకు తల దువ్వే
కాళ్లకు గజ్జెలు కట్టవుకే
పేరంటానికి వెడతాను
కాళ్లకు పసుపూ పూస్తారు
చుట్టూ పారాణి పెడతారు
శనగల వాయనం ఇస్తారు
అప్పుడు ఇంటికి వస్తాను;
పశువులు ఇంటికి వచ్చాక
పాలూ బువ్వా తింటాను."

సూరి తెల్లపువ్వుల ఎర్రపరికిణీ కట్టుకొంది. తెల్ల జుబ్బా తొడుక్కొంది. మెడలో ఒక చిన్న కాసులపేరు ఉంది. కాళ్లకు వెండికడియాలు పెట్టుకుంది. చేతులకి బంగారం మురుగులున్నాయి. అప్పుడే తల దువ్వుకొని కాటుకా బొట్టూ పెట్టుకొంది.

ఇంట్లో వాళ్లమ్మ వాళ్ల చెల్లాయిలిద్దరికీ తల దువ్వుతోంది. సూరికి ఎనిమిదేళ్ల వయస్సు. చామనచాయగా, బక్కపలచగా ఉంటుంది. అసలు సూరిపేరు సూర్యకాంతం. తను బళ్లో చదివీ రెండోవాచకపుస్తకం మీాద 'సూరే కాంతం' అని తన పేరు వ్రాసుకొంది. అసలు పేరు సూర్యకాంతం అయినప్పటికీ వాళ్లమ్మ దాన్ని ఎప్పుడూ 'సూరి' 'సూరి' అని పిలుస్తూవుంటుంది. వాళ్లమ్మ పిలవడం చూచి వాళ్ల నాన్నకూడా సూరి సూరి అనే పిలుస్తూఉంటాడు.

వాళ్లమ్మ వంట చేసుకొనే టప్పుడూ, నీళ్లకు వెళ్లినప్పుడూ సూరి తన చెల్లెళ్లనిద్దరినీ ఆడిస్తూ ఉంటుంది.

ఆవేళ పేరంటానికని అందరూ ముస్తాబు అవుతున్నారు. ముందుగా సూరి ముస్తాబై అరుగు మీద కూర్చుని పాట పాడుకొంటూ ఉంది.

ఇంతట్లోకే గుమ్మంలో నిలబడి ఒకపిల్ల

"సూరీ సూరీ చుంచెలక

మా ఇంటి కొస్తే మంచెలక

సూరీ సూరీ చుంచెలక

మా ఇంటి కొస్తే మంచెలక"

అని పాడుతూ చేతులు తట్టుతూ నవ్వుతూ సూరిని ఉడికించింది.

ఈ పిల్ల సీతి.

సీతి అసలు పేరు సీతారాముడు. వాళ్ల నాన్నా అమ్మా ముద్దుకోసం సీతి అని పిలుస్తూ ఉంటారు. సీతికి ఆరేళ్ల వయస్సు. తీరైనముఖము. చేరెడేసి కళ్లు. ఎర్రగా ఉంటుంది. కొత్త తెల్లపరికిణీ కట్టుకొని, పువ్వుల చొక్కా తొడుక్కొని, గళ్లరుమాలు చేత్తో పట్టుకొని పేరంటానికి సిద్ధంగా ఉంది.

సీతికి మెళ్ళో చిన్న కంటే, చేతులకు గాజులూ, కాళ్లకు కడియాలూ ఉన్నవి. అందాకా వాళ్లమ్మ కాసులపేరు మెళ్ళో వేసుకొంది.

"సూరీ సూరీ చుంచెలక

మా ఇంటి కొస్తే మంచెలక"

అని సీతి సూరిని చూచి అనడం సూరి విని మూతి ముడిచి, "అమ్మతో చెప్పనా" అంది.

"చెప్పు నాకేం భయమా ఏమిటి?"

"సరే లే జ్ఞాపకం ఉంచుకో; నిన్ను పేరంటానికి తీసుకొని వెళ్లుతానేమో ఉండు" అంది సూరి.

"నేను అమ్మతోనే వెళతాను" అంది సీతి.

సూరి నవ్వి "నేనుమాత్రం అనలే ననుకున్నావా ఏమిటి" అని,

"సీత పీత

ముంజకాయ మూత

కొడవ లెట్టి కోత

సీత పీత

ముంజకాయ మూత

కొడవ లెట్టి కోత"

అని సీతిని ఉడికించడం మొదలుపెట్టింది. సీతికి ఉడుకుబోత్తనం వచ్చి, "అమ్మా, చూడవే, అక్కయ్యా" అంది.

"నన్నెందు కనాలి ముందు" అంది సూరి.

"నన్నెందుకు పేరంటానికి తీసుకెళ్ల నన్నావు?" అంది సీతి.

"చూశావా, చూశావా అబద్ధాలు. ముందు నేను తీసుకెళ్ల నన్నానా?"

సీతి నవ్వి పారిపోయింది. ఇంతట్లోకే ఇంట్లోంచి మూడేళ్ల చిన్నపిల్ల వచ్చి సూరి వెనక్కాల నిలబడింది. దీనిపేరు వెంకి. అసలుపేరు వెంకటరమణ. వాళ్ల అమ్మా నాన్నా వెంకి అని పిలుస్తారు. అంచేత అందరు వెంకి అని పిలుస్తారు. వెంకి పొట్టిగా ఉంటుంది. ఎర్రగా ఉంటుంది. మెళ్లోచిన్నికంటెపెట్టుకుంది. చేతులికిగాజులూ, కాళ్లకు కడియాలూ ఉన్నవి. ఎర్రపువ్వుల తెల్ల పరికిణీ కట్టుకొంది. పట్టుజుబ్బా తొడుక్కొంది.

బొట్టూ కాటుకా పెట్టుకొని పేరంటానికని గళ్లరుమాలు చేత్తో పట్టుకొని వచ్చింది.

"రావే, వెంకీ, ఇక్కడ కూచో" అని సూరి తన పక్కను వెంకిని కూచోబెట్టుకుంది. వెంకి పరికిణీ మాసిపోకుండా పొందికగా ఎత్తి పట్టుకొని సూరి పక్కని కూర్చుంది.

ఇంతట్లోకే సీతి మళ్లీవచ్చి గుమ్మంలో నిలబడి, వెంకిని చూచి:

"వెంకి డొంకి
ఏడు మూళ్ల దుప్పటి
కప్పుకుంటె చాలదు
కందిపప్పు పచ్చడి
వెంకి డొంకి
ఏడుమూళ్ల దుప్పటి
కప్పుకుంటె చాలదు
కందిపప్పు పచ్చడి."

వెంకికి పాపం ఉడుక్కోవడం తెలియదు.

"ఎందుకే, గయ్యాళి, దాన్నంటావూ? అమ్మతో చెపుతానుండు" అంది సూరి.

"చెప్పు, చెప్పు, నాకాళ్లకు బంగారు చెప్పులు కుట్టించు" అంది సీతి.

"అలాగే ఉండు. అమ్మ రానీ" అంది సూరి.

"సూరి సూరి చుంచెలక
మాఇంటి కొస్తె మంచెలక"
అంది సీతి.

"సీత పీత
ముంజకాయ మూత
కొడవ లెట్టి కోత"
అంది సూరి.

"వెంకి డొంకి
ఏడుమూళ్ల దుప్పటి
కప్పుకుంటె చాలదు
కందిపప్పు పచ్చడి"
అంది సీతి.

"సీత పీత
ముంజాయ మూత" అంది వెంకి.

ముగ్గురూ కలిసి ఒకళ్ల కంటె ఒకళ్లు గట్టిగా అనడం మొదలుపెట్టారు.

"అన్నా, అన్నా, ఏమిటర్రా ఆ అల్లరి" అంది, లోపలనుంచి వాళ్లమ్మ.

"చూడవే అమ్మా మరి. నేనూ వెంకీ ఇక్కడ కూచుంటే ఈసీతి" అంది సూరి.

"అవునే సీతీ" అంది వాళ్లమ్మ.

"కాదే, అమ్మా. నన్నే ముందస్తిగా అందే సూరి" అని సీతి నవ్వింది.

"సూరీ, నువ్వుకూడా అల్లరి చేస్తున్నావా" అంది వాళ్లమ్మ.

"కాదే అమ్మా. సీతి, అన్నీ అబద్ధాలే. నేను ఇక్కడ కూచుంటేను, తనొచ్చి నన్ను సూరీ సూరీ అందే" అంది సూరి.

"లేదే అమ్మా అన్నీ ఉత్తమాటలే" అంది సీతి.

"మరి వెంకి నెందుకన్నావు" అంది సూరి.

"వెంకి నన్నెందు కంది, మఱి" అంది సీతి.


"పాపం. అదందా, ముందర నువ్వన్నావా. అబద్ధాలాడితే ఆడపిల్లలూ పుడతారులే" అంది సూరి.

"నీకే అందరూ ఆడపిల్లలు పుడతారు" అంది సీతి.

"ఊరుకోరు గాదూ, వస్తున్నా ఉండండి" అని వాళ్లమ్మ కేకేసింది.

అందరూ ఊరుకొన్నారు. వాళ్లమ్మకూడా ముస్తాబై వచ్చింది. సీతి మెళ్ళో కాసులపేరు తన మెళ్ళో వేసుకొంది.

"అబ్బాయీ, మే మొచ్చిందాకా ఇంటి దగ్గిర ఉంటావు కాదూ" అని వాళ్లమ్మ వాళ్లన్నతో చెప్పి పేరంటానికి బయలు దేరింది.



వాళ్లమ్మ ముందు నడుస్తోంది. ఆవిడ వెనకే సూరి నడుస్తోంది. సూరి కుడిచెయ్యి సీతి పట్టుకుంది. ఎడమ చెయ్యి వెంకి పట్టుకొంది. "ఎత్తుకోనా వెంకీ" అంది వాళ్లమ్మ. "నే నడుత్తా" నంది వెంకి. అందరూ కలిసి అవతల వీథిలో ఇంటికి వెళ్లారు. వాళ్లింట్లో వాళ్లమ్మాయి పుట్టిన రోజు. ఆ అమ్మాయికి రెండోఏడు. తలంటి నీళ్ళోసి పట్టు చొక్కా తొడిగి ముస్తాబు చేసి కుర్చీలో కూచోబెట్టారు. పేరంటాళ్లందరూ వచ్చారు. సూరీ, సీతీ, వెంకీ ఆ అమ్మాయికేసి చూస్తూ నిలబడ్డారు.

ఆ అమ్మాయి తల్లి పేరంటాళ్లందరికీ పసుపూ పారాణీరాసింది. సూరికీ సీతికీకూడా రాసింది. వెంకికి చిన్నపిల్లని రాయకపోతే సూరితో చెప్పి రాయించుకొంది.

తరవాత ఆ అమ్మాయికి అందరూ కలిసి హారతి ఇచ్చారు. హారతిపళ్లెం సీతీ వెంకీ కూడా పట్టుకుంటామని పట్టుకొన్నారు. పేరంటాళ్లు మంగళారతిపాటలు పాడారు. సూరినికూడా పాడమన్నారు గాని సూరి సిగ్గుపడి పాడింది కాదు. తరవాత అందరికీ శనగల వాయనం, తాంబూలం ఇచ్చారు. సీతికీ వెంకికీ కూడా ఇచ్చారు. సీతి శనగలూ, వెంకి శనగలూ సూరి మూటలు కట్టిపెట్టింది. తన శనగలు కూడా మూట కట్టుకొంది. తరవాత వాళ్లందరూ ఇంటికి ప్రయాణమయ్యారు. "అమ్మా, మన వెంకి కిప్పుడే పుట్టిన రోజు" అంది సీతి.

"శ్రావణమాసం" అంది వాళ్లమ్మ.

"అమ్మా, వాళ్లమ్మాయి మరి మన వెంకిలాగ నడవలేదేమే" అంది సూరి.

"వాళ్లమ్మాయి మన వెంకి కన్న చిన్నది కాదుటే" అంది వాళ్ళమ్మ.

"అమ్మా, నన్నెత్తుకోవూ" అంది వెంకి.

"రా, అమ్మా, రా. ఎత్తుకుంటాను రా. ఎంత దూరం నడిచిందో నా చిట్టితల్లి" అంది వాళ్లమ్మ.

"అమ్మా నన్ను కూడా ఎత్తుకోవూ" అంది నవ్వుతూ సీతి.

"నిన్ను కూడా ఎలా ఎత్తుకోనే? ఆ మాత్రం నడవలేవుటే" అంది వాళ్లమ్మ.

అందరూ వాళ్లింటికి చేరారు. వాళ్ల నాన్న గారుకూడా అప్పుడే కచేరీ నుంచి ఇంటికి వచ్చారు.

"నాన్నగారికి కాళ్లు కడుక్కోడానికి నీళ్లియ్యవే సూరీ" అంది వాళ్ళమ్మ.

సూరికంటె ముందుగానే సీతి పరుగెత్తుకు వెళ్లి వాళ్లనాన్నగారికి నీళ్లు తీసుకువచ్చి ఇచ్చింది. వెంకికూడా చిన్నిచెంబుతో వాళ్లనాన్నగారికి నీళ్లు తెచ్చిపెట్టింది.

"వెంకి మీకు కాళ్లు కడుక్కోవడానికి నీళ్లు తెచ్చింది చూశారా" అంది వాళ్లమ్మ.

వాళ్లనాన్నగారు "నువ్వా తెచ్చావుటే వెంకీ" అని వెంకిని ఎత్తుకొని ముద్దెట్టుకొన్నారు.

"నాన్నా, నాన్నా, మేమేం, పేరంటానికి వెళ్ళి శనగలు తెచ్చాం" అంది సూరి.

"మీ అమ్మ అన్నం వండుతుంది గాని నువ్వ శనగలు నేతిలో వేయించి ఉప్పూ కారం చల్ల గలవా" అన్నాడు వాళ్లనాన్న.

"వేయిస్తా వేయిస్తా" అని సూరి సంతోషాన్ని గంతులేసింది.

"అదెందుకూ? చెయ్యి కాల్చుకొంటుంది. నే వేయిస్తాను లెండి" అంది వాళ్లమ్మ.

"చెయ్యి కాల్చుకోను, నాన్నా, నే వేయించొద్దూ" అంది సూరి.

"దాన్ని వేయించనియ్యవే, పాపం" అన్నాడు వాళ్ల నాన్న.

"సరే మీ ఇష్టం" అంది వాళ్లమ్మ.

సీతీ వెంకీ పక్కనే కూచున్నారు. సూరి కుంపటి మీద శనగలు వేయించింది. అందరూ అన్నాలు తిన్నాక సూరి వేయించిన శనగలు ఫలారం చేశారు. ఎంత నిద్ర వచ్చినా వెంకి నిద్ర పోకుండా ఆగి శనగలు తిని మరీ నిద్ర పోయింది. సూరీ సీతీ ఒక మంచంమీదే పడు కొన్నారు. కథలు చెప్పకుంటూ నిద్రపోయారు. వెంకి వాళ్లమ్మ దగ్గిర నిద్దరోయింది.

---